సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 17 | ఫిబ్రవరి | 2023



రూ. 3.65 లక్షల విరాళం


ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు అలుమోలు సుబ్బారావు (ఫైడిపర్రు) గురువారం రూ.3,65,000 విరాళంగా అందజేశారు.



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గురువారం తాతబ్బాయి(సామర్లకోట), గుళ్ల బ్రహ్మం కుటుంబ సభ్యులు (గోపాలపట్నం) రూ.1,00,116 చొప్పున సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325 ,పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.25 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సమర్థంగా సమగ్ర శిక్ష పథకాలు



దీఈఓ కమలకుమారిని కలిసిన సమగ్ర శిక్ష సిబ్బంది

ముమ్మిడివరం: సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న పథకాలు సమర్థంగా అమలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ ఎం.కమలకుమారి సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కమలకుమారిని గురువారం డీఈఓ కార్యాలయంలో సమగ్ర శిక్ష సిబ్బంది, కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్షలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆమె సమీక్షించారు. సమగ్ర శిక్ష పనులు, ప్రణాళిక బడ్జెట్ తదితర విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఈకోఆర్డినేటర్ సత్యనారాయణ, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ, ఏడీ ఎం.సురేష్, ఎం.రవికుమార్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చిట్టెమ్మ

మండపేట: పట్టణంలోని గొల్లపుంతకు చెందిన శతాధిక వృద్ధురాలి గాదంశెట్టి చిట్టెమ్మ గురువారం మృతిచెందారు. ఆమె వయసు 105 సంవత్సరాలు. చిట్టెమ్మ భర్త తమ్మిరాజు గతంలో కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామానికి మునసబుగా చేసేవారు. ఈమెకు ఒక కుమార్తె ఉంది. 40 ఏళ్ల క్రితమే కూతురు కోసం మండపేట వచ్చి స్థిరపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమం, ఆనాటి సంగతులు చెబుతుండేదని ఆమె మునిమనుమలు యాదగని దొరబాబు, గణేష్ తెలిపారు. ఆమె ఆరోగ్యంగా ఉండేదని, చనిపోయేంత వరకు తన పనులు తానే చేసుకునేదన్నారు. తమ తాతమ్మ ఉదయం కాఫీ, మధ్యాహ్నం, సాయంత్రం గానుగునూనె, పచ్చడి లేదా కారప్పొడితో వేడివేడిగా రెండు ముద్దల అన్నం మాత్రమే తినేదని వారు తెలిపారు. చిట్టెమ్మ మృతి పట్ల పలువురు ఆమె కుటుంబ సభ్యులకు తమ సంతాపాన్ని తెలిపారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలోని నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని గురువారం పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకిరామయ్య సత్రం కార్యనిర్వాహణాధికారి ఎం.రాధాకృష్ణ పర్యవేక్షణలో లెక్కించారు. 63 రోజులకు గాను రూ.28,79,610 లభించినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ తెలిపారు. ఇంకా 14 విదేశీ నోట్లు, 8.6 గ్రాముల బంగారం, 411 గ్రాముల వెండి లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ పాలకమండలి చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి

అమలాపురం రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి అమలాపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న శైవ క్షేత్రాలైన కుండలేశ్వరం, ముక్తేశ్వరం, కోటిపల్లి క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు శనివారం ఉదయం నాలుగు గంటల నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. శని త్రయోదశిని పురస్కరించుకొని మందపల్లి శనీశ్వరుని ఆలయం దర్శించుకునే యాత్రికులకు అమలాపురం నుంచి రావులపాలెం వరకు షటిల్ సరీ్వసులు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలని మూర్తి కోరారు.

అనువుగా.. మరింత సులువుగా

- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 546 సేవలు
- ఏపీ సేవా పోర్టల్ ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇంటికి
- ఐఆర్‌సీటీసీ పోర్టల్ ద్వారా రైల్వే టికెట్‌లు



ఈదరపల్లి సచివాలయంలో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సాక్షి అమలాపురం: సామాన్యులకు అందించే సేవలో గ్రామ సచివాలయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ వారి నమ్మకాన్ని చూరగొంటున్నాయి. జనం తమ సమస్యల పరిష్కారం కోసం మండల, మున్సిపల్, కార్పొరేషన్ల గడప తొక్కకుండానే సేవలందుతున్నాయి. కొన్ని రకాల సేవలు ఇంటి వద్దకే వచ్చి చేస్తున్నారు.

9,12,213 సమస్యల పరిష్కారం

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలలోనూ... 22 మండలాల పరిధిలో సచివాలయాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలందుతున్నాయి. జిల్లాలో మొత్తం 515 సచివాలయాలున్నాయి. గత ఏడాది జనవరి 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 9,41,640 అర్జీలు రాగా, 9,12,213 సమస్యలను పరిష్కరించారు. వీటిలో 15,646 సమస్యలను తిరస్కరించగా, 13,781 సమస్యలు వివిధ దశలలో ఉన్నాయి.

పక్కాగా ఏర్పాట్లు

- గ్రామ సచివాలయాల ద్వారా 546 సేవలందించేందుకు ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఎక్కువగా ఆధార్, రేషన్ కార్డుల మార్పులు, పింఛన్లు ఇతర ప్రాంతాలకు మార్చుకోవడం, రెవెన్యూ పరంగా సరిహద్దు సమస్యలపై సర్వేలకు అర్జీలు అందుతున్నాయి. వీటితోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు.
- కొత్తగా ఏపీ సేవా పోర్టల్ ద్వారా ఆధార్‌లో మార్పులు చేర్పులకు, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఓబీసీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ), రేషన్ కార్డులలో మార్పులు, చిరునామా మార్పులు చేస్తారు. వాటిని ఇళ్ల వద్దకు వచ్చి అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఇది పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డులకు సైతం ఇవే సేవలందజేస్తున్నారు.
- ఐఆర్‌సీటీసీ ద్వారా ఐదు నెలలుగా రైల్వే టిక్కెట్లు తీసుకుంటున్నారు. ఇది కూడా పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు.
- కలెక్టరేట్‌కు వస్తున్న ఫిర్యాదులలో చాలా వరకు గ్రామ స్థాయిలో పరిష్కరించే అవకాశముందని గుర్తించిన ప్రభుత్వం సచివాలయాల్లో రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్పందన అర్జీల స్వీకరించేందుకు సమయం కేటాయించారు. ఇక్కడ సమస్య చెప్పుకున్నా నిర్దిష్టమైన గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గం	అందిన అర్జీలు	పరిష్కరించినవి	తిరస్కరించినవి
అమలాపురం	1,55,193	1,51,384	2,306
ముమ్మిడివరం	1,55,906	1,52,368	1,935
పి.గన్నవరం	1,43,307	1,39,440	2,043
రాజోలు	97,819	94,734	1,415
కొత్తపేట	1,43,092	1,38,442	2,561
రామచంద్రపురం	76,310	73,207	3,007
మండపేట	1,70,013	1,62,638	2,197
మొత్తం	9,41,640	9,12,213	15,646

నాలుగు రోజులలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్



మాది అమలాపురం మండలం ఈదరపల్లి. ఉద్యోగం కోసం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్నాను. కేవలం నాలుగు రోజులలో సర్టిఫికెట్ ఇచ్చేశారు. నిర్ణీత గడువుకన్నా పది రోజుల ముందే నాకు సర్టిఫికెట్ వచ్చింది.

– చింతపల్లి వీరేంద్ర, బీటెక్

ప్రభుత్వమే దగ్గరయ్యింది



ప్రజలకు నేరుగా తక్కువ కాలంలో సేవలందుతున్నాయి. దగ్గరలోని సచివాలయానికి వెళ్లి అర్జీ ఇస్తుంటే సకాలంలో పరిష్కరిస్తున్నారు. మొబైల్ ఆధార్ క్యాంపులు కూడా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది.

– పువ్వాడ విజయ్ థామస్, డీడీవో, అమలాపురం

కర్రసాములో గాయత్రికి రెండు గోల్డ్ మెడల్స్



తాను సాధించిన గోల్డ్‌మెడల్ చూపుతున్న గాయత్రి

అల్లవరం: న్యూఢిల్లీలో కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న అమర్ షాహిద్ జనరల్ బిపిన్‌రావత్ మెమోరియల్ నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఓడలరేవు గ్రామానికి చెందిన పినపోతు గాయత్రి రెండో రోజున సింగిల్, గ్రూపు కర్రసాము విభాగాల్లో విన్నర్‌గా నిలిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. ఈ విషయాన్ని తల్లి పినపోతు సుగుణ ఫోన్‌లో తెలిపారు. బుధవారం జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ జూనియర్ విభాగంలో పంజాబ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులపై గాయత్రి విజయం సాధించి రాష్ట్రానికి తొలి బంగారు పతకాన్ని అందించిన సంగతి తెలిసిందే. వైజాగ్‌లోని ఎంఎస్ రాజు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గాయత్రి జాతీయ స్థాయిలో రాణించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అమృత్ సరోవర్ ద్వారా
చెరువుల అభివృద్ధి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షుశుక్లా. చిత్రంలో జేసీ ధ్యానచంద్ర తదితరులు

కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశం

అమలాపురం రూరల్: కూలీల వలసల నివారణ కోసం అమృత్ సరోవర్ ద్వారా చెరువుల అభివృద్ధి, వివిధ డ్రెయిన్లలో పూడికతీత పనులు ప్రస్తుత సీజన్‌లో ముమ్మరంగా చేపట్టాలని డ్వామా పథక సంచాలకులు మధుసూదనరావును కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, రెవెన్యూ అంశాలపై గ్రీవెన్స్ పరిష్కారసరళి, వ్యవసాయ ఉద్యాన, మత్స్య, పశుసంవర్థక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి గృహ నిర్మాణాలు స్వచ్ఛ సంకల్పం గృహ నిర్మాణాలకు 90 రోజులు పని దినాల కల్పన జిల్లాల వారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ఈ క్రాప్ బుకింగ్, ఫార్మర్ ఈ కేవైసీ అంశాలలో సూపర్ చెక్‌లు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖలు నిర్వహించాలని సూచించారు. మార్చి నెల నుంచి వైఎస్సార్ యంత్ర సేవా పరికరాల గ్రూపుల ఏర్పాటు ద్వారా ఆర్బీకే స్థాయిలో కస్టమ్ హైరింగ్ కేంద్రాల పేరిట యంత్ర సేవా పరికరాలు సన్న చిన్న కారు రైతులకు తక్కువ అద్దెతో అందుబాటులో రానున్నాయన్నారు. జేసీ ధ్యానచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యతో కొత్త ఆవిష్కరణలు

కలెక్టర్ హిమాన్షుశుక్లా



అంబాజీపేటలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అంబాజీపేట: విద్యార్థులు చిన్నతనం నుంచి ప్రయోగాత్మక విద్యను అభ్యసించాలని తద్వారా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. అంబాజీపేట హైస్కూల్‌లో డీఈఓ ఎం.కమలకుమారి అధ్యక్షతన కోనసీమ జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యను అమలు చేయాలని, సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ పరంగా సహకారం అందుతుందన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన నిర్వాహకులు పర్యావరణ పరిరక్షణ, ఎకో ఫ్రెండ్లీ, ఆరోగ్యం, సంరక్షణ తదితర రంగాల్లో తయారు చేసిన ప్రాజెక్టులు ఆలోచింపచేసేలా ఉన్నాయన్నారు. చిన్నతనం నుంచే తల్లితండ్రులు తమ పిల్లలకు పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఎరువులు, వృధాలను తగ్గించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం నేర్పాలన్నారు. దీని వల్ల పాఠశాల స్థాయి నుంచి నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు ప్రయత్నిస్తారన్నారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ జి.నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు విభిన్న రంగాల్లో ఎంతో ప్రతిభావంతులని, వారిలో ఉన్న ఆవిష్కరణల ఆలోచనలను వెలికితీయాలన్నారు. కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి మాట్లాడుతూ గణిత, సామాన్య శాస్త్రాలలోని సిద్ధాంతాలను ప్రయోగాత్మకంగా వివరించవచ్చన్నారు. ప్రాజెక్టుల ఎంపిక ఎంతో పారదర్శకంగా ఉండాలని న్యాయ నిర్ణేతలకు సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లోని 110 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు నేటి సమాజానికి అనుగుణంగా నూతన ఆలోచనలతో ప్రాజెక్టులను రూపొందించారని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి జి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ అంశాలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు ఎంపిక చేసేందుకు అధ్యాపకులు, శాస్త్రవేత్తలను న్యాయనిర్ణేతలుగా నియమించామన్నారు. వారి నివేదిక ప్రకారం పది మంది ఈ నెల 27, 28లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అంతకుముందు సైన్సు ఆకారాలను రంగవల్లుల రూపంలో చిత్రీకరించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. సీవీ రామన్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీవైఈఓ పి.షాలెం రాజు, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ కార్యదర్శి బీర హనుమంతరావు, ఎంఈఓలు కిష్టోఫర్ కార్నేలియస్, కోన హెలినా, జిల్లా గెజిటెడ్ హెడ్ మాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మోకా ప్రకాష్, సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఏపీఓ భీమారావు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జావసత్వాలు

- మార్చి 2 నుంచి బడిపిల్లలకు బ్రేక్ ఫాస్ట్‌గా రాగిమాల్ట్
- పౌష్టికాహారం అందించడమే లక్ష్యం
- జిల్లాలో 1.18 లక్షల మందికి ప్రయోజనం



మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

రాయవరం: పేద, మధ్య తరగతి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. విద్యార్థులకు జగనన్న గోరుముద్దగా ఇప్పటికే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు నూతనంగా బ్రేక్‌ఫాస్ట్‌గా రాగిజావను కూడా అందించేందుకు చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో డ్రాపౌట్స్‌ను తగ్గించడమే కాకుండా విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పేరుతో నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. నాణ్యతలో రాజీ పడకుండా విద్యార్థులకు కడుపునిండా కమ్మని భోజనం పెడుతోంది. రోజుకొక మెనూతో మధ్యాహ్న భోజన పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడంతో పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య కూడా తగ్గింది. పాఠశాలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనాన్ని తీసుకునేందుకు వారి అభిరుచులకు అనుగుణంగా ఇప్పటికే మూడుసార్లు మెనూలో మార్పులు చేశారు. దీనికితోడు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు, చిక్కీని అదనంగా అందిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 22 మండలాల్లో 1,581 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ప్రభుత్వ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,18,798 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తీసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోంది.

మార్చి 2 నుంచి రాగి జావ

వచ్చే నెల 2వ తేదీ నుంచి విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఉదయం బ్రేక్ ఫాస్ట్‌గా రాగిజావను అందించనున్నారు. విద్యార్థులు ఉదయం పాఠశాలలకు రాగానే వారికి 10గంటల లోపుగా రాగిజావను ఇస్తారు. బెల్లం, చోడిపిండితో తయారు చేసిన రాగిజావను ఇవ్వడం ద్వారా ఐరన్, కాల్షియం లోపాలను అధిగమించే వీలుంటుంది. రాగిజావ, మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాలను అధిగమించి, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు వీలవుతుంది.

పటిష్టంగా అమలుకు చర్యలు



పాఠశాల విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం రోజుకొక మెనూతో విద్యార్థులకు రుచికరమైన ఆహార పదార్థాలను అందజేస్తోంది. తాగునీటి కోసం ప్రభుత్వం పాఠశాలల్లో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేసింది. కొత్తగా ప్రభుత్వం అమలు చేయనున్న బ్రేక్‌ఫాస్ట్‌ను కూడా సమర్థంగా అమలు చేస్తాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం సమర్థంగా అమలు చేస్తున్నాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశం. ఉదయం బ్రేక్ ఫాస్ట్‌గా అందజేసే రాగిమాల్ట్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం.

– నక్కా సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్, జగనన్న గోరుముద్ద, అమలాపురం

విజయనగరంలో హరికథా కళాశాల ఏర్పాటు

సినీ నటి కరాటే కళ్యాణి



కళ్యాణిని సత్కరిస్తున్న రాష్ట్ర బీజేపీ నేత దొరబాబు, సుబ్బారావు తదితరులు

అమలాపురం రూరల్: విజయనగరంలో హరికథా కళాశాలతో పాటు దేవాలయాల నిర్మాణం చేపడుతున్నానని, హరికథల చెప్పడం ద్వారా వచ్చే ఆదాయాన్ని వాటి నిర్మాణానికి వినియోగిస్తున్నానని సినీనటి, ప్రముఖ హరికథా కళాకారిణి కరాటే కళ్యాణి చెప్పారు. ఇందుపల్లి గ్రామంలో శ్రీబాల భక్త గణపతి సేవ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆమె హరికథ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరికథల్ని ఏర్పాటు చేసి కళలను ప్రోత్సహించాలని కోరారు. ఆమె చేసిన సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం హరికథ గానం ఆకట్టుకుంది. బీజేపీ కార్యదర్శి యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శ మోకా సుబ్బారావు, సినీ యూనియన్ నాయకులు గుర్రం రామకృష్ణ ఆమెను ఘనంగా సత్కరించారు. అనంతరం బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో కళాకారులను సన్మానించారు

క్లుప్తంగా

కారు ఢీకొని తండ్రి, కుమారులకు తీవ్ర గాయాలు

పి.గన్నవరం: రాజవరం–పొదలాడ రోడ్డులో నాగుల్లంక గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని కారు మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో నాలుగేళ్ల బాలుడితో సహా తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. కారును ఆపకుండా డ్రైవర్ పరారీ అయ్యాడు. క్షతగాత్రులను స్థానికులు రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు గ్రామం దొరవారితోటకు చెందిన అమలదాసు వెంకటరమణ జగ్గన్నపేటలోని మెడ్‌ప్లస్ మెడికల్ షాపులో పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం పి.గన్నవరంలో జరిగిన వివాహ కార్యక్రమానికి తన నాలుగేళ్ల కుమారుడు నర్సింహులుతో కలిసి మోటారు సైకిల్‌పై పి.గన్నవరం వస్తున్నారు. నాగుల్లంక గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇక విద్యోగం

- పాఠశాల విద్యలో మరో ముందడుగు
- వృత్తి విద్య బోధనకు చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 10 స్కూళ్ల ఎంపిక



వృత్తి విద్య అమలు చేయనున్న అల్లవరం మండలం గోడిలోని గురుకుల పాఠశాల


పాఠశాల విద్యార్థులు

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. విద్యార్థి కేంద్రంగా బోధన చేసేందుకు పలు విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వెళ్లేటప్పటికి వారి కాళ్లపై వారు నిలబడే విధంగా పథకాలను అమలు చేస్తోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యాబోధన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే తొమ్మిదో తరగతి విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేపట్టారు. ఈపీడీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కింద ప్రతి శుక్రవారం వారికి తరగతులు నిర్వహిస్తూ యాజమాన్య మెళకువలను నేర్పుతున్నారు. ఇప్పుడు 6–8 తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వృత్తి విద్యాబోధన అమలు చేసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు.

సన్నద్ధం చేసేది ఇలా..

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో అధిక శాతం వృత్తి విద్యా కోర్సులను ఎంపిక చేసుకుంటున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర ఉపాధి గ్యారంటీ కోర్సుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థులను ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో భాగంగా పాఠశాల స్థాయిలో వృత్తి విద్యాబోధన అమలు చేసేందుకు నిర్ణయించింది. పని అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పిస్తారు. చేతి పనులు చేయటంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించడం, విద్యార్థుల్లో పరస్పర సహకారం, టీమ్ వర్క్‌ను అలవాటు చేస్తారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం

పాఠశాల స్థాయిలో వృత్తి విద్య అమలుకు తగిన ప్రణాళికలు గణితం, సైన్సు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు సిద్ధం చేస్తారు. పాఠశాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు, ప్రధానంగా చేతివృత్తుల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను తీసుకువెళ్తారు. స్థానికంగా చేతి వృత్తులు చేసే నిపుణులను పాఠశాలలకు రప్పించి, వారితో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తారు. చేతి వృత్తుల, పరిశ్రమల నిర్వహణదారులతో ముఖాముఖీ ఏర్పాటు చేస్తారు. తద్వారా 9–12 తరగతులు చదివే సమయానికి వృత్తి విద్యలో అనుభవం వచ్చేలా విద్యార్థులను సమాయత్తపర్చడం దీని ఉద్దేశం. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఎంపిక చేసిన పాఠశాలలివీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

జెడ్పీహెచ్ఎస్ చెముడులంక, ఆలమూరు మండలం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్(బాలురు), గోడి, అల్లవరం మండలం. జెడ్పీహెచ్ఎస్, సమనస, అమలాపురం మండలం.

తూర్పుగోదావరి జిల్లా

జెడ్పీ ఉన్నత పాఠశాలలు, శాటిలైట్ సిటీ, రాజమహేంద్రవరం రూరల్ మండలం, కడియం, గోకవరం.

కాకినాడ జిల్లా

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏలేశ్వరం, కాకినాడ. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, బాలికలు, చొల్లంగిపేట. తాళ్లరేవు మండలం

అమలుకు చర్యలు



ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో వృత్తి విద్య అమలుకు చర్యలు చేపడతాం. విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యను పరిచయం చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఇది విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

స్నేహితుడి భార్యను కాపాడబోయి యువకుడి మృతి


నరేంద్రకుమార్ (ఫైల్)

నిడదవోలు రూరల్: క్షణికావేశంలో కాలువలోకి దూకిన స్నేహితుడి భార్యను కాపాడబోయి ప్రమాదవశాత్తూ యువకుడు మృతిచెందినట్లు పట్టణ ఎస్సై పి.నాగరాజు గురువారం తెలిపారు. నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామానికి చెందిన కాపకాయల నరేంద్రకుమార్ (31) గతంలో ఒక ప్రైవేట్ సెల్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసి ప్రస్తుతం వ్యవసాయ పనులు చేస్తున్నాడు. నరేంద్రకుమార్ స్నేహితుడు కొవ్వూరుకు చెందిన జావిద్ బాషా(చోటు)కు అతని భార్య దేవికి మనస్పర్థలు వచ్చాయి. దీంతో నరేంద్రకుమార్ భార్యాభర్తలను ఈ నెల 14వ తేదీన శెట్టిపేట తీసుకువచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. అయినా గొడవలు పెరగడంతో భార్య దేవి.. శెట్టిపేట పవర్‌ప్లాంట్ వద్ద బుధవారం తెల్లవారుజామున వంతెనపై నుంచి కాలువలోకి దూకేసింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో కాలువలోకి దిగిన నరేంద్రకుమార్ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా నరేంద్రకుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి నాగతులసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

వెంటనే కావలెను
మేనేజర్లు - 2
PRO - 1
పర్సనల్ అసిస్టెంట్స్ - 2
డ్రైవర్లు - 2
వంట మనిషి - 2 (ఆడ-1 మగ-1)
పనిమనుషులు-2
76800 32459

Walk- in - Interview
(1) Primary Teachers
(2) Secondary Teachers
(3) I.I.T. Foundation Course Teachers
For All Subjects
Interview : 19-2-2023 Sunday @ 10 AM
visit school Campus :
RAJAMAHENDRI INTERNATIONAL SCHOOL
Bommuru to Kesavaram Road, Sampath Nagar,
RAJAHMUNDRY
Note : North Indian and B.Tech Female Graduates will be given Preference

SRI MAHATHI EM SCHOOL
Shivalayam Street, Katavaram,
Seethanagaram Mandal, Near RJY
WALK-IN-INTERVIEW
A New Educational Trend setter school invite potential candidates for Teaching & Administration
1) IIT/NEET Foundation Teachers (6th to 10th)
2) High School Teachers - All Subjects
3) Primary Teachers - All Subjects
4) Asst. Teachers and Incharges
5) PET - Music - Drawing
6) Computer and DTP Operators
♦ FRESHERS / EXPERIENCED
♦ Good Salary for Deserving Candidates
E-mail: srimahathi.katavaram@gmail.com

వైఎస్సార్ సీపీ నేత నిర్మలకుమారి ఆకస్మిక మృతి

- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి
- పలువురు ప్రముఖుల నివాళి


నిర్మలకుమారి (పాతచిత్రం)

ఆలమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ మాజీ అధ్యక్షురాలు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత కొల్లి నిర్మలకుమారి (47) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆలమూరులోని ఆమె నివాసంలో నిద్రిస్తుండగా గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. నిర్మలకుమారి భర్త రాజరత్నం మూడేళ్ల క్రితం గుండెపోటుతోనే మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2001–2006 మధ్య కాలంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ తరపున జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ ప్రతిపక్ష నేతగా వ్యవహరించి ప్రజలకు సేవలందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర తొలి మహిళ అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

నిర్మలకుమారి మృతి తీరని లోటు

వైఎస్సార్ సీపీ మహిళ నేత నిర్మలకుమారి మృతి పార్టీకి, తమకు తీరని లోటని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆమె పార్టీ అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదన్నారు. మరణవార్త తెలుసుకున్న ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హుటాహుటిన ఆలమూరులోని ఆమె నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిర్మలకుమారి కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- తొలిరోజు నామినేషన్లు నిల్
- 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- మార్చి 13న ఎన్నిక
- 16న ఓట్ల లెక్కింపు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి గురువారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.ఇలక్కియ నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలిరోజు ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయలేదు. ఈ నెల 23 తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ), 26, 27 తేదీల్లో ఉపసంహరణ ఉంటుంది. మార్చి 13న ఎన్నిక నిర్వహిస్తారు. 16న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని ఎన్నిక రిటర్నింగ్ అధికారి ఇలక్కియ వివరించారు. జిల్లాలో మొత్తం 1,436 మంది ఓటర్లు ఉండగా వీరిలో 640 మంది పురుషులు, 796 మంది మహిళలు ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికకు కాకినాడ, పెద్దాపురం, రాజమహేంద్రవరం, అమలాపురం, రామచంద్రపురం, రంపచోడవరం, ఎటపాక, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు.

నేత్ర పర్వంగా భీమేశ్వరుని కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పూలతో అలంకరించిన వేదిక


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సామర్లకోట: బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాలకు స్వాగతం పలుకుతూ ప్రతి ఏడాది ముందుగా స్వామివారి కల్యాణం జరుగుతుంది. దీనిలో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధుల గుండా గ్రామోత్సవం పూర్తి చేసుకొని రాత్రి ఆలయానికి చేరింది. ఆలయంలో గ్రామోత్సవంలో పాల్గొన్న స్వామి వారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్యాండ్ మేళాల మధ్య ఆలయంలోని తోటలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి అమ్మవారి విగ్రహాలను ఉంచారు. ఈ మేరకు వేదికను పూలతో అలంకరించారు. అన్నవరం దేవస్థానం నుంచి వేదపండితులు పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. పారిశ్రామిక వేత్త గంజి బూరయ్య ముత్యాల తలంబ్రాలు ఏర్పాటు చేశారు. అన్నవరం, ఆలయ వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. ఈ కల్యాణంను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో పట్టణ పరిధిలోని పారిశ్రామిక వేత్తలు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ట్రస్టుబోర్డు సభ్యులు, భక్త సంఘం నాయకులు భక్తులకు సేవలందించారు.

సత్తా చాటిన గుమ్మిలేరు


గుమ్మిలేరులో నిర్వహించిన ఎడ్ల పరుగు పందెం


బహుమతులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

- ప్రథమ, ద్వితీయ అవార్డులు కైవసం
- ముగిసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు
- విజేతలకు ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అవార్డుల ప్రదానం

ఆలమూరు: రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేల్లో ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు మరొకసారి తన సత్తాను చాటింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులను బహూకరించారు. స్థానిక వరహా కాలువ రోడ్డులో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్ విభాగాల్లో గురువారం నిర్వహించిన ఈ పోటీలను సర్పంచ్ గుణ్ణం రాంబాబు, కోరా వీరభద్రరావు గుణ్ణం శ్రీనివాసు, అముజూరు శ్రీనివాసు పర్యవేక్షించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 32 ఎడ్ల జతలు పాల్గొనగా అందులో 25 జతల ఎడ్లు సీనియర్ విభాగంలో పోటీ పడగా ఏడు జతల ఎడ్లు జూనియర్ విభాగంలో పోటీ పడ్డాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జంతు ప్రేమికులు వచ్చి ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులందరిని నిర్వాహకులు సత్కరించారు. ఎడ్ల పరుగు పందేల వద్ద ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో భారీ బందోబస్తు నిర్వహించారు. జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య, రైసుమిల్లర్స్ వంటిపల్లి పాపారావు, వంక సత్యనారాయణ (అన్నవరం), వైట్ల దుర్గారావు, ముత్యాల భాస్కరరావు పాల్గొన్నారు.

విజేతలు వీరే

సీనియర్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా సామర్లకోటకు చెందిన గుణ్ణం అనూరాధ ఎడ్లు తృతీయ స్థానం సాధించాయి. జూనియర్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి (ప్రథమ), సామర్లకోటకు చెందిన గుణ్ణం అనూరాధ (ద్వితీయ) వల్లూరి వెంకట్రావు మెమోరియల్ దేవి అన్నపూర్ణ రైసుమిల్లు (తృతీయ), ధర్మవరానికి చెందిన దొడ్డిపట్ల రామగీతిక, లక్ష్మణ గోకుల (చతుర్థ), గండేపల్లికి చెందిన ఎల్.దుర్గ (పంచమ) స్థానాలు సాధించారు. ఎడ్ల పరుగు పందెం విజేతలను, నిర్వాహకులను ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services
■ We Release your pledged gold బంగారం బ్యాంక్సులో ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5590]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197746]
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2787]
■ బంగారం బ్యాంకులలో కొనబడును. ముతూట్ మనపురం ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో ఈ రోజు రేట్ ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 88024 89999 [B-6046]
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786678]

HEALTH CARE
■ మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరగడానికి, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. రాజమండ్రి : (ఇంతకు ముందు మెట్రోలాడ్జి) ఇప్పుడు Same కేంప్ "శ్రీ సాయిలక్ష్మి లాడ్జిలో మందులు" SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా. ప్రతీ నెల 3, 17 తేదీన మందులు [V- 2543]

ఆయుర్వేదం
■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-971]

Wanted
■ RJYలో జాబ్ చేయుటకు లేడీ MULTI MEDIA Computer Operators కావలెను. ఆకర్షణీయమైన జీతం. అడ్రస్ : World in Action. Ho No.107, Municipal Colony, RJY. Cont : 7386096289 [R-5583]
■ Experienced, Qualified Female Teachers to teach 4th all Subjects & English, Biology High School. Sadhana High School, Tilak St., Kakinada Ph: 98482 26333 [R-428]
■ కన్‌స్ట్రక్షన్స్‌లో మంచి అనుభవం ఉన్న సూపర్ వైజర్ కావలెను. Cont: శ్రీ గాయత్రి ఏజెన్సీస్, కాకినాడ. ✆ : 94403 52688 [R-203]
■ ప్రముఖ బ్యాంక్‌లో పని చేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age: 40 to 53 yrs, జనరల్ షిఫ్ట్, 26 Days, ప్రదేశం: రావులపాలెం, అనపర్తి, దవళేశ్వరం, పెద్దాపురం, జగ్గంపేట, ఏలేశ్వరం. ✆ 91826 46763 [B-896]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp, Dr, Q.5th- డిగ్రీ. 10–30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd, Ph: 7995374999 [HA-998]
■ ఎ.టి.యం బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు, హాస్పటల్స్, ఆఫీసుల యందు సిబ్బంది కావలెను. కలెక్షన్ ఎక్జిక్యూటివ్ జీ.25 వేలు, బ్రాంచి మేనేజరు జీ.40 వేలు, ఎ.టి.యం మనీ ట్రాన్స్ ఫర్ సూపర్ వైజర్ జీ.28వేలు, ఆఫీసు స్టాఫ్ కావలెను. స్త్రీ/పు అ: 10 to డిగ్రీ. ఇం: 17,18,19. సంప్ర: 8897049482 [P-1226530]
■ రాజమండ్రిలోని రేవతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నందు Qualified Technicians, Accountant, సెక్యూరిటీ గార్డులు, ఫార్మాసిస్ట్, GNM Nurses, B.Sc Nurses. కావలెను. ఇంటర్వ్యూ టైమింగ్స్: 10am to 12ap, 5pm-7pm. 16-2 to 22-2-23 ✆ 9491915709. [B-786583]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781824]
■ ఆకాశ ఎయిర్‌లైన్స్‌లో వర్క్ చేయుటకు ఎయిర్ క్యాబిన్ సూపర్‌వైజర్స్, టీం లీడర్స్, సూపర్‌వైజర్స్, కస్టమర్ కేర్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్ వైజర్స్ కావలెను. Qly: 10th-డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, జీతం: 23,000/- to 29,000/- రూం + ఫుడ్ ఫ్రీ. వ: 18-35 సం॥. ✆ 88850 39153 [B-762872]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్సాహంగా హాకీ పోటీలు



మ్యాచ్‌లో తలపడుతున్న తమిళనాడు- అండమాన్ నికోబార్ జట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయ విమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. మొదటి మ్యాచ్ మహారాష్ట్ర హాకీ, పుదుచ్చేరి హాకీ మధ్య జరిగింది. మాజీ డీఎస్‌డీఓ మురళీధర్ క్రీడాకారిణులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. మహారాష్ట్ర హాకీ జట్టు 7–0 స్కోర్‌తో విజయం సాధించింది. క్రీడాకారిణి మనషిరి నాగేంద్ర ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆడిటర్ రాంమోహన్ చేతుల మీదుగా అందుకుంది. రెండో మ్యాచ్‌లో హాకీ యూనిట్ ఆఫ్ తమిళనాడు, హాకీ అండమాన్ నికోబార్ జట్లు పోటీపడ్డాయి. 32–0 స్కోర్‌తో తమిళనాడు యూనిట్ జట్టు విజయం కైవసం చేసుకుంది. ప్రియంగ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ చేతుల మీదుగా తీసుకుంది. గురువారం నిర్వహించిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, ట్రెజరర్ పీటర్, టోర్నమెంట్ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

కోర్టులో దొంగతనం


ఏసీల మరమ్మతులు చేపడుతున్న టెక్నీషియన్లు

కాకినాడ క్రైం: కాకినాడ కోర్టులో దొంగతనం జరగడం కలకలం రేపింది. కోర్టుల ప్రాంగణంలో పలు న్యాయస్థానాల్లో జడ్జిల రూంలను అనుసంధానం చేసి ఉన్న ఏసీల కాపర్ వైర్లను ఆగంతకులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. నాల్గవ అదనపు జిల్లా కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టుల ఏసీల కాపర్ వైర్లను దొంగలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కాకినాడ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల వ్యవధిలో ఈ దొంగతనాలు చోటు చేసుకున్నట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం బార్ అసోసియేషన్‌లో ఇదే తరహాలో కాపర్ వైర్ల దొంగతనం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని బార్ బృందం పేర్కొంది. కాపర్ వైర్ల చోరీల నేపథ్యంలో ఏసీలకు మరమ్మతులు నిర్వహించారు.

విచారణకు సహకరించని నర్సింగ్ స్కూళ్ల యజమానులు

కాకినాడ క్రైం: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎం) పరీక్షల మాస్ కాపీయింగ్‌తో కదలిన అవినీతి డొంకలో నిజాలు నిగ్గు తేల్చేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పడ్డ త్రిసభ్య కమిటీ తన విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్ చైర్మన్‌గా సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావు, ఏవో శ్రీనివాస్ సింగ్ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ ఇచ్చిన ముందస్తు షెడ్యూల్ ప్రకారం గురువారం సుమారు 25 నర్సింగ్ స్కూళ్ల యజమానులు విచారణకు హాజరుకావలసి ఉంది. అయితే 10 కళాశాలల యజమానులు మాత్రమే విచారణకు వచ్చారు. విచారణ సమయం ముగుస్తుండడంతో ఫోన్లు చేసి పిలిచినా స్పందించలేదు. హాజరుకాని వారి జాబితాను విచారణ కమిటీ ప్రత్యేకంగా సిద్ధం చేసింది. పలు నర్సింగ్ స్కూళ్ల నుంచి లంచాలు తీసుకొని మాస్ కాపీయింగ్‌కు లోపాయికారీ అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఎదుర్కొంటూ, ఉన్నతాధికారుల ప్రాథమిక చర్యలకు గురైన జీజీహెచ్ జూనియర్ అసిస్టెంట్ కొండేపూడి శేఖర్ వైఖరి కమిటీ సభ్యుల్ని తీవ్ర అసంతృప్తికి గురి చేసింది. జీజీహెచ్‌లో విధుల్లో ఉండి కూడా విచారణ సమయం ముగిశాక, మధ్యాహ్నం ఒంటి గంటకు ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా హాజరవడంతో కమిటీ సభ్యులు ఇదేం నిర్లక్ష్యం అంటూ మండిపడ్డారు. వెళ్లిపొండంటూ తిరిగి పంపేశారు. విచారణకు వచ్చిన నర్సింగ్ స్కూళ్ల ప్రతినిధుల నుంచి పలు ప్రశ్నలకు లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారు. ఆ వివరణ పత్రంతోపాటు విచారణకు హాజరుకాని స్కూళ్ల వివరాలు, విధుల్లో ఉండి కూడా విచారణకు హాజరుకాని శేఖర్ పేరును జత చేస్తూ కమిటీ బృందం విచారణ నివేదికను సిద్ధం చేసినట్టు జీజీహెచ్ ఉన్నతాధికారులు తెలిపారు. నివేదికను సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు పంపనున్నారు. విచారణ మరింత లోతుగా జరగాల్సిన అవసరాన్ని కలెక్టర్‌కు పంపే నివేదికలో ప్రస్తావించారు.